

విచారణ వేగవంతం చేయాలి 2

2 ‘పద్మశాలి’ ఎన్నికలకు నామినేషన్లు





కొత్త పింఛన్ల కోసం రాస్తారోకో 2

www.aksharatoday.com

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND




9-5-2025 (FRIDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2

# పాక్‌పై భారత్ చర్యలు సరైనవే..

## ‘ఆపరేషన్ సింధూర్’పై వివిధ పార్టీల నేతల మనోగతం



**భారత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. పహల్‌గామ్ ఉగ్రదాడి ఘటనపై కేంద్రం ప్రతీకార చర్యలు చేపట్టింది. ‘ఆపరేషన్ సింధూర్’ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రమూకల భరతం పడుతోంది. ఈ ఘటనతో భారతీయులు హర్షతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు పోరును కొనసాగించాలని.. సైన్యానికి యావత్ ప్రజలు అండగా ఉంటారని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీల నేతలు పేర్కొంటున్నారు.**

– అక్షరటుడే, నిజామాబాద్/కామారెడ్డి

### ఆలోచించాలి..

- మానాల మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నిజామాబాద్



భారతదేశ సైనిక బలం, సంపద, శక్తి సామర్థ్యాలను పాక్ తక్కువగా అంచనా వేసింది. పాక్ మూలాలను దెబ్బతీసే శక్తి సామర్థ్యాలు మన సైన్యం వద్ద ఉంది. భారత్‌తో తలపడేముందు పాకిస్తాన్ ఆలోచించాల్సి ఉండాల్సింది. సైనికులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ తరపున, వ్యక్తిగతంగా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాను.

### ఇండియన్ ఆర్మీకి సెల్యూట్..



విపత్కర పరిస్థితుల్లో ఇండియన్ ఆర్మీ ప్రదర్శిస్తున్న తెగువకు సెల్యూట్ చేస్తున్నా.. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మహిళా ఆర్మీ అధికారుల సారథ్యంలో పాకిస్తాన్‌పై దాడులు చేయడం ప్రశంసనీయం.

- బాజిరెడ్డి జగన్‌మోహన్, బీఆర్ఎస్ యువనేత

### ఉగ్ర స్థావరాలపైనే దాడి..



పహల్‌గామ్ ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య. మతాన్ని అడిగి మరీ హతమార్చడం అమానుషం. అందుకే మోదీ ప్రభుత్వం కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే దాడి చేస్తోంది. సామాన్యుల జోలికి వెళ్లడం లేదు.

- దినేష్ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్

### టెర్రరిజంను రూపుమాపాలి



టెర్రరిజాన్ని సమూలంగా రూపుమాపే సమయం ఆసన్నమైంది. ఆ దిశగా ప్రపంచ దేశాలు ఏకం కావాలి. పాక్ టెర్రరిజానికి మద్దతిస్తుందని ప్రపంచ దేశాలు కూడా నమ్ముతున్నాయి.

- నీలం చిన్న రాజులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి

### ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు



పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పేలా చర్యలు తీసుకుంటున్న భారత ప్రభుత్వానికి వ్యక్తిగతంగా, పార్టీపరంగా మద్దతిస్తున్నాం. పాక్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా కేంద్రం గట్టి గుణపాఠం చెబుతోంది.

- ముజీబోద్దీన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి

### ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని ఎంఐఎం తరపున ఖండిస్తున్నాం. భారత సైన్యం ఉగ్రమూకలపై జరుపుతున్న దాడికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నాం. మళ్లీ దాడులకు పాల్పడకుండా ఉగ్రవాదులను అంతం చేయాలి.

- ఫయాజుద్దీన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు, నిజామాబాద్

### ఉగ్రవాద మూలాలను అణిచివేయాలి



భారతదేశం నుంచి ఉగ్రవాద మూలాలను అణిచివేయాలి. కాంగ్రెస్ పార్టీకి దేశ సమగ్రత ముఖ్యం. దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను అంతమొందించేందుకు భారత ప్రభుత్వానికి అండగా నిలుస్తాం.

- కైలాస్ శ్రీనివాస్ రావు, డీసీసీ అధ్యక్షుడు, కామారెడ్డి

## బాన్సువాడ డీఎస్పీగా విఠల్ రెడ్డి



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ డీఎస్పీగా విఠల్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ సత్యనారాయణ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన విఠల్ రెడ్డి బదిలీపై బాన్సువాడకు వచ్చారు.

## జాకోరా లిఫ్ట్‌తో సాగుకష్టాలు దూరం



**అక్షరటుడే, బాన్సువాడ:** జాకోరా ఎత్తిపోతల పథకం పూర్తయితే 4,470 ఎకరాలకు సాగు నీరందుతుందని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్ని మండలం జాకోరా ఎత్తిపోతల వద్ద నూతన విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## ధ్యానంతోనే ఆరోగ్యం పదిలం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ధ్యానంతో ఆరో గ్యం పదిలంగా ఉంటుందని సినీనటి పూనమ్ కౌర్ అన్నారు. నగరంలోని నాందేవ్‌వాడలో ఉన్న బ్రహ్మకుమారీస్ సంస్థలో శుక్రవారం ధ్యానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధ్యానం చేయడం వల్ల శాంతిగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌ఛార్జి సునీత బెహన్‌జీ, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శాంతి చర్చలతోనే మావోయిస్టుల సమస్యకు పరిష్కారం

**అక్షరటుడే, కామారెడ్డి:** శాంతి చర్చలతోనే మావోయిస్టుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మావోయిస్టులు మందుపాతర పేల్చిన ఘటనలో మృతి చెందిన పాల్వంచకు చెందిన వడ్ల శ్రీధర్ అంత్యక్రియలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. కాగా.. అంత్యక్రియలకు మంత్రి పొన్నం హాజరయ్యారు. శ్రీధర్ పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. శ్రీధర్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీధర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు.



జవాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి

### మావోలపై కేంద్రం ఉక్కుపాదం..

మావోల ఏరివేతపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోందని, చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ కూడా ప్రకటించిందని మంత్రి తెలిపారు. అయితే ప్రాణనష్టం జరగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశభక్తికి నిలువెత్తు రూపం మహారాణా ప్రతాప్

**అక్షరటుడే, ఇందూరు:** ధైర్యానికి, దేశభక్తికి నిలువెత్తు రూపం మహారాణా ప్రతాప్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బొందిల రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహారాణా ప్రతాప్ జయంతిని నిర్వహించారు. ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మొగలుల నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భరతమాత ముద్దుబిడ్డ అని కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మహారాణా ప్రతాప్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధన్‌పాల్

## కొత్త పింఛన్ల కోసం రాస్తారోకో



**అక్షరటుడే, కోటగిరి:** కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు రోడ్డెక్కారు. పోతంగల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్) మాట్లాడుతూ.. కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మక్కయ్య, శంకర్, అశోక్, హన్మాండ్లు, వెంకట్ రావు, లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

## యూరియా వినియోగం తగ్గించాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** రైతులు తమ పంట పొలాల్లో యూరియాను తక్కువగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య పేర్కొన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో అన్నదాతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రదీప్ కుమార్, ఆహార శాస్త్రవేత్త అమల, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వేములవాడకు ఎక్స్‌ప్రెస్ బస్సు



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ నుంచి వేములవాడకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు డిపో మేనేజర్ సరితా దేవి తెలిపారు. బాన్సువాడ నుంచి ఉదయం 8.20 గంటలకు బయలుదేరి కామారెడ్డి మీదుగా 11.20కి వేములవాడ చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి 11.40 గంటలకు వేములవాడ నుంచి బాన్సువాడకు సాయంత్రం 6.10 గంటలకు చేరుకుంటుందని వివరించారు.

## పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతాం



శ్రీకాంత్



అనిల్

**అక్షరటుడే, నిజాంసాగర్:** పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పాటు పడతామని మహమ్మద్ నగర్ బీజేపీ నూతన మండలాధ్యక్షుడు దమనబోయిన శ్రీకాంత్, కామారెడ్డి జిల్లా కౌన్సిల్ మెంబర్ కొండా అనిల్ సేట్ పేర్కొన్నారు. పార్టీ పదవులకు న్యాయం చేస్తామన్నారు. తమ నియామకానికి కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుకు కృతజ్ఞతలు తెలిపారు.

# దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భూభారతి దరఖాస్తుల విచారణ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం లింగంపేట్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతుల నుంచి భూవివాదాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు 4,225 దరఖాస్తులు రాగా.. పరిశీలించి పరిష్కరించేందుకు తొమ్మిది టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు 1,443 దరఖాస్తులకు సంబంధించిన క్షేత్ర పర్యటన చేసి భూములను పరిశీలించినట్లు చెప్పారు. మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిం చారు. అలాగే ఫారెస్ట్ భూముల జాయింట్ సర్వే, దీర్ఘకాలిక పెండింగ్ దరఖాస్తులు కూడా పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో ప్రభాకర్, భూ భారతి ప్రత్యేక అధికారి రాజేందర్, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకుడు శ్రీనివాస్, ఎఫ్‌డీఓ రామకృష్ణ, తహసీల్దార్లు, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

# పద్మశాలి సంఘం ఎన్నికలకు నామినేషన్ దాఖలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు ఈనెల 25న జరుగనున్నాయి. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్యానెల్ సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్యానెల్‌లో అధ్యక్షుడిగా పెంటం దత్తాద్రి పోటీ చేయనున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా చౌటి భూమేష్, ఉపాధ్యక్షులుగా భీమర్తి రవి, కన్నా దుబ్బ రాజం, బాగుల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా బీజీ ప్రసాద్, భూస రవి, ఎనుగందుల సుభాష్, కోశాధికారిగా మోర సాయిలు, ఆర్గ నైజింగ్ సెక్రెటరీగా కస్తూరి గంగరాజు, ప్రచార కార్యదర్శిగా బూస శ్రీనివాస్‌లు మార్కండేయ మందిరంలో నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా నాయకులు ఎస్సార్ సత్యపాల్, అమృతాపురం గంగాధర్, బిల్ల మహేష్, మదన్ మోహన్, సిలివేరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని మోపాల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్‌లో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో బైక్‌లతో పాటు పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డట్టుగా నవీన్ అంగీకరించాడని పోలీసులు తెలిపారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపేట మండలం నల్లమడుగు తండాకు చెందిన విద్యార్థిని అర్చన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మృతురాలు తండ్రి విఠల్‌ను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు దివిటి రమేష్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు ఉన్నారు.

## ఘనంగా బాలు మామ విగ్రహావిష్కరణ



**అక్షరటుడే, బిచ్కుంద:** జుక్కల్ మండలంలోని హంగర్గలో కురుమల ఆరాధ్య దైవం బాలు మామ విగ్రహావిష్కరణ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్ ప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులు ఉండడంతో మూడు రాష్ట్రాల సంస్కృతులు, ఆధ్యాత్మిక వాతావరణం ఉంటుందన్నారు. కర్ణాటకలోని బెలగావిలో జన్మించిన బాలు మామ శివ భక్తుడిగా ప్రాచుర్యం పొంది ఆధ్యాత్మిక ప్రచారంతో పాటు బలహీన వర్గాల ప్రజలను చైతన్య పరుస్తూ.. వారి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు.

## ప్రైమరీ స్కూల్ హెచ్ఎంల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** తమ సమస్యలను పరిష్కరించాలని ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో పీజీ హెచ్ఎంల మాదిరిగా తమకు కూడా శిక్షణ నిర్వహించాలని కోరారు. అలాగే కాంప్లెక్స్ సమావేశాల్లో కార్యదర్శి హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎంలు మురళి, ప్రశాంత్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నరేష్, సందీప్ పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** రైళ్లలో పోగొట్టుకున్న ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు తిరిగి అప్పజెప్పినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లోని పోలీస్ కార్యాలయంలో బాధితులకు శుక్రవారం ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లలో ప్రయాణికులు ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

### కామారెడ్డిలో..



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న 130 ఫోన్లను స్పెషల్ డ్రైవ్ ద్వారా రికవరీ చేశామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. బాధితులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి తమ ఫోన్లను పొందవచ్చని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక రికవరీ టీం ఉందని.. మూడురోజుల్లోనే 130 ఫోన్లను రికవరీ చేశామని వివరించారు. టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. ఎవరైనా బాధితులు తమ సెల్‌ఫోన్లు పోతే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. ప్రత్యేక పోర్టల్‌ద్వారా వాటిని ట్రేస్ చేస్తామని ఆయన చెప్పారు.

## బసవేశ్వరుడు ఆదర్శప్రాయుడు



**అక్షరటుడే, బాన్సువాడ:** మహాత్మా బసవేశ్వరుడు అందరికీ ఆదర్శప్రాయుడని బిచ్కుంద పీఠాధిపతి సద్గురు సోమలింగ శివాచార్య స్వామీజీ అన్నారు. శుక్రవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీం పేట్ గ్రామంలో మహాత్మ బసవేశ్వర విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బసవేశ్వరుని ఆదర్శంగా తీసుకొని కులమతాలకతీతంగా దేశం కోసం, ధర్మం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవేందర్, హన్మాండ్లు, అంజు, దెగ్లూర్ శంకర్, మల్లికార్జున్, సంగప్ప, భాస్కర్, లింగం, శంకర్, జాయి సుదీప్, శ్యాం, గంగాధర్, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఆటో, మోపెడ్ వాహనాలు ఢీకొన్న ఘటనలో పలువురు గాయాలపాలయ్యారు. ఎల్లారెడ్డి నుంచి రుద్రారం వైపు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ ఆటోను టీవీఎస్ మోపెడ్ వాహనం ఢీకొంది. ఈ క్రమంలో ఆటో బోల్తాపడగా, అందులో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న మున్సిపల్ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు.